నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, శనివారం 13 ఏప్రిల్ 2024 | RANGAREDDY



చేవెళ్లలో సిద్ధమైన ప్రజా ఆశీర్వాద సభా వేదిక



- గులాబీ అడ్డాలో నేడు కేసీఆర్ సభ
- 2 లక్షల వరకు జనం వస్తారని అంచనా
- సభా ప్రాంగణంలో రెపరెపలాడుతున్న గులాబీ జెండాలు, నేతల కటౌట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి
- గులాబీ బాస్ రాకతో కొత్తపుంతలు తొక్కనున్న లోక్ సభ ఎన్నికల ప్రచారం

# చలో చేవెళ్ల

రంగారెడ్డి, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న చేవెళ్లకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయంత్రం 5 గంటలకు జరిగే 'ప్రజా ఆశీర్వాద సభ'లో ఆయన పాల్గొంటారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎంపీ ఎన్నికల తొలి ప్రచార బహిరంగ సభ కావడంతో పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి శుక్రవారం సభా ఏర్పాట్లను పరిశీలించారు. గులాబీ బాస్ రాకతో జిల్లాలో లోక్ సభ ఎన్నికల ప్రచారం కొత్తపుంతలు తొక్కనున్నది.

## సర్వం సిద్ధం..

బహిరంగ సభను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని సర్వం సిద్ధం చేసింది. 2 లక్షల మందికి పైగా జనం సభకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నారు. సభకు వచ్చే వీఐపీలు, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళల కోసం వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. షాబాద్ నుంచి వచ్చే వాహనాలకు అదే రూట్‌లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. సభా స్థలికి కొద్ది దూరంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అక్కడే తమ వాహనాలను పార్కింగ్ చేసి కాలినడకన సభా ప్రాంగణానికి ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది.

ఫరా కళాశాల మైదానంలోని విశాలమైన స్థలంలో సభకు ఏర్పాట్లు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే మైదానంలో బీఆర్ఎస్ పార్టీ సభ నిర్వహించింది. కేసీఆర్ రోడ్డు మార్గంలోనే సభకు రానున్నట్లు తెలిసింది. ఒకవేళ.. హెలికాప్టర్‌లో వస్తే.. అందుకు సైతం నేతలు ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు దగ్గరుండి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## గులాబీమయం..


కేసీఆర్ పాల్గొనే ఎన్నికల బహిరంగ సభకు చేవెళ్ల ముస్తాబైంది. పట్టణంలోని రోడ్లన్నీ గులాబీ జెండాలతో రెపరెపలాడుతున్నాయి. ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట గులాబీ ఫ్లెక్సీలు, జెండాలను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాన్ని సైతం గులాబీమయం చేశారు. ప్రజలు దూరం నుంచి కూడా సభను వీక్షించేందుకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు.



చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణం

- ఎంపీ సీట్ల కేటాయింపులో బలహీన వర్గాలకు బీఆర్ఎస్ పెద్దపీట
- పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక
- కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





# గుంపుమేస్త్రికి గుణపాఠం చెబుదాం

## క్యామ మల్లేశ్‌ను గెలిపిద్దాం

ఇబ్రహీంపట్నం/ఆదిబట్ల, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గంపుమేస్త్రికి గుణపాఠం చెబుదామని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం బొంగుళూరు సమీపంలోని ప్రమిదగార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీ సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేసిందన్నారు. అందులో భాగంగానే భువనగిరి స్థానంలో క్యామ మల్లేశ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆర్థిక ప్రగతితోనే సమానత్వం వస్తుందన్న జ్యోతిరావు పూలే, అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ ఆచరణలో చూపించారన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బడుగుబలహీన వర్గాలకు అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. 1008 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించామన్నారు. కులవృత్తులను ప్రోత్సహించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశామన్నారు. గొల్లకురుమల ఆర్థిక అభివృద్ధి కోసం 11 వేల కోట్లతో సబ్సిడీపై గొర్రెలు, రూ.35 వేల కోట్లతో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేశామన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలతో నేతన్నలకు అండగా నిలిచామన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగుబలహీన వర్గాలకు చెందిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, ఒకరిద్దరు అవకాశవాద నేతలు పార్టీని వీడినంతమాత్రాన జరిగే నష్టమేమిలేదన్నారు. స్థానికుడైన భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. రాముని పేరు చెప్పి ఓట్లు అడగడానికి వస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, దండే రాంరెడ్డి, జక్క రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, జడ్పీటీసీ జంగమ్మ, ఏర్పుల చంద్రయ్య, మంకు ఇందిర, మంద సురేశ్, ఆకుల యాదగిరి, కల్వకోలు రవీందర్‌రెడ్డి, పొట్టి శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షులు బుగ్గ రాములు, రమేశ్ గౌడ్, కిషన్‌గౌడ్, చీరాల రమేశ్, మున్సిపాలిటీ అధ్యక్షులు కొప్పు జంగయ్య, అల్వాల వెంకట్‌రెడ్డి, దామోదర్, కల్యాణ్‌నాయక్, అనితగౌడ్, సుకన్య, అశ్విని, లక్ష్మారెడ్డి, పాశ్చ భాష, భాస్కర్‌రెడ్డి, బహదూర్‌నాయక్, జెర్కొని రాజు, మొద్దు అంజిరెడ్డి, అరవింద్ అప్ప, సింగిల్‌విండో చైర్మన్లు రాజేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్..



కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజా సంక్షేమాన్ని విస్మరించింది. మరోసారి గారడీ మాటలతో మోసం చేసేందుకు గ్రామాలకు వస్తున్న కాంగ్రెస్ నాయకులను చీపురుతో తరిమికొట్టాలి. బీఆర్ఎస్‌ను గెలిపించుకొని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఎంపీ ఎన్నికల రూపంలో మంచి అవకాశం వచ్చింది. క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కరెంట్ లేక, నీరు లేక పంటలు ఎండిపోతున్నా, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం కనిపించడంలేదు. ఇలాంటి సర్కార్ తగిన గుణపాఠం చెప్పాలంటే బడుగుబలహీన వర్గాల బిడ్డ అయిన క్యామ మల్లేశ్‌ను గెలిపించుకోవాలి.

–ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

### ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉన్నది..



భువనగిరి పార్లమెంటు అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బీఆర్ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు ఉన్నది. గతంలో ఎంపీగా ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది శూన్యం. ఈ నియోజకవర్గంలోని యదాద్రి ఆలయాన్ని అత్యధిక నిధులతో తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే. బలహీన వర్గాలకు చెందిన నన్ను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా. ఎన్నికల్లో అవకాశవాద రాజకీయలతో పార్టీ మారిన బీజేపీ అభ్యర్థి, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పాలి.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి

### సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది..



కాంగ్రెస్ ప్రభుత్వం తీరు సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్న చందంగా ఉన్నది. బీఆర్ఎస్ హయాంలో అత్యధిక నిధులు తీసుకువచ్చి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రారంభించి.. వారు చేసిన ప్రగతి పనులంటూ చెప్పుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధిని కాంక్షించి బీఆర్ఎస్ సర్కార్ ఏర్పాటు చేసిన ఫార్మాసిటీ, ఫాక్స్‌కాన్‌ను కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేసింది.

–మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

### క్యామ మల్లేశ్‌ను ఆదరించండి



నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానంలో ఇదివరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఎవరికీ దక్కలేదు. ఈ సారి బీఆర్ఎస్ పార్టీ నుంచి క్యామ మల్లేశ్‌కు దక్కింది. ఈ ప్రాంత ప్రజలంతా రాజకీయాలకతీతంగా కారు గుర్తుకు ఓటేసి ఎంతో రాజకీయ అనుభవం కలిగిన మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

–వంగేటి లక్ష్మారెడ్డి

### ప్రతి కార్యకర్త ఎంపీ అభ్యర్థిగా పని చేయాలి..



ఎంపీ ఎన్నికల్లో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఎంపీ అభ్యర్థిగా పని చేయాలి. ఇబ్రహీంపట్నంపై ఎంతో ప్రేమతో కేసీఆర్ నియోజవర్గానికి చెందిన బడుగు బలహీన వర్గానికి ఎంపీ సీటు కేటాయించారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం.

–మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



# కేసీఆర్ సభను సక్సెస్ చేయాలి

- నేడే చేవెళ్లలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- ఏడు నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది వస్తారని అంచనా..
- సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, స్వామిగౌడ్, కార్తీక్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 12 : చేవెళ్లలో నేడు జరుగనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలోని సభాప్రాంగణాన్ని ఆమె ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు కేసీఆర్ అభ్యర్థులను అన్ని విధాలా ఆలోచించి నిలిపారన్నారు. 12 స్థానాల్లో 50 శాతం సీట్లు బీసీలకు ఇవ్వడం గొప్ప పరిణామమన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా గతంలో రంగారెడ్డి జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా సేవలందించిన కాసాని జ్ఞానేశ్వర్‌కు ఇవ్వ డం ద్వారా బడుగు, బలహీన వర్గాల వారు.. బీసీలు పార్టీలకతీతంగా బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని.. కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని ఆమె పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పదేండ్ల కేసీఆర్ పాలన, వంద రోజుల కాంగ్రెస్ పాలనను చూస్తే ఒక అనుభవమున్న నాయకుడు పాలన చేస్తే ఏ విధంగా ఉంటుందో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నదని సబితారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో నీటి వనరులను పెంచాలనే సంకల్పంతో కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. పాలమూరు ప్రాజెక్టు దాదాపుగా పూర్తి కావొచ్చిందని.. కాల్వల తవ్వకం పనులు పూర్తైతే చేవెళ్లకు సాగునీరు వస్తుందన్నారు. ఆడబిడ్డలు బిందెలు పట్టుకుని బయటికి రావొద్దనే ఉద్దేశంతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిన 111 జీవోతో ఎత్తివేశారన్నారు. చేవెళ్లలో నేడు జరుగనున్న బహిరంగ సభకు ఏడు నియోజకవర్గాల నుంచి 2 లక్షల వరకు జనం వస్తారని ఆమె చెప్పారు. సాయంత్రం 4:30 గంటలకు కేసీఆర్ సభ వేదికకు చేరుకుంటారని, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రాంబాబుయాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మల్లారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, గోపాల్, శేఖర్ పాల్గొన్నారు.

### బీసీ నేతను గెలిపించుకుందాం..


బీసీ నేతకు అవకాశం వచ్చినందున బీసీలందరం పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేద్దాం. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారు. అందరికీ అండగా ఉన్నారు.

–స్వామిగౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్

### కాసాని గెలుపునకు కృషి చేయాలి

బడుగు, బలహీన వర్గాల నాయకుడు కాసానిని కేసీఆర్ ఎంపిక చేయడం గొప్ప పరిణామం. జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

–కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే



చేవెళ్ల : ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, కార్తీక్‌రెడ్డి